ప్రజాశక్తి

గురువారం 1 ఆగస్టు 2024 — 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

❁స్టాక్ పాయింట్ల వద్ద దందా ❁రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న వైనం ❁బిల్లులు లేకుండానే లోడింగ్ ❁తెలంగాణాలో పట్టుబడుతున్న లారీలు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గ పరిధిలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. ఐదు ప్రధాన శాఖల పర్యవేక్షణలో నడిచే ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద నుండే ఎంఎల్‌ఎ, ఎంపి అనుచరులమంటూ కొందరు ఇసుక దందాకు పాల్పడుతున్నారు. మరికొందరు మీడియా ముసుగులో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. కొందరు ఎలాంటి రుసుం చెల్లించకుండా లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తూ రోజూ ఒక్కొక్కరు లక్ష రూపాయల వరకు వెనకేసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఉచితంగా లారీలకు లోడింగ్ చేసిన ఇసుక ఎలాంటి వే బిల్లులు లేకుండా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఇక్కడి నుండి తెలంగాణాకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలను అక్కడ పోలీసులు పట్టుకుంటున్నారు. ఇటీవల వారం రోజుల క్రితం కంచికచర్ల మండలం

కంచికచర్ల మండలం కీసర ఇసుక నిల్వ కేంద్రం



కీసర నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని తెలంగాణ రాష్ట్రం మధిర పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. తాజాగా బుధవారం (మిగతా 2లో)



తెలంగాణ రాష్ట్రం ఎర్రపాలెం వద్ద పట్టుబడ్డ ఆంధ్ర ఇసుక లారీ

సిసి కెమెరాలు లేనప్పుడు జరిగి ఉండొచ్చు

ఇసుక నిల్వ కేంద్రం ఇన్చార్జి అధికారి బాల శంకరరావు

రాజకీయ పలుకుబడితోపాటు మరి కొందరి వాహనాలకు బిల్లులు లేకుండా ఇసుక లోడింగ్ చేస్తున్నారనే దానిపై ఇసుక నిల్వ కేంద్ర ఇన్చార్జి అధికారి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ కె.బాల శంకరరావును ప్రజాశక్తి ప్రశ్నించగా, ఆయన సమాధానం దాటవేశారు. వ్యక్తి ప్రాధాన్యత, పలుకుబడిని బట్టి కొందరి వాహనాలకు డబ్బులు లేకుండా, ఎలాంటి రశీదు ఇవ్వకుండా ఇసుక లోడింగ్ చేసి ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే నిల్వ కేంద్రం వద్ద సిసి కెమెరాలు పెట్టనప్పుడు జరిగిందేమోనని పేర్కొన్నారు. ప్రస్తుతం సిసి కెమెరాల నిఘాలో పారదర్శకంగా ఇసుక లోడింగ్ జరుగుతోందని తెలిపారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తపై స్పందించిన విఎంసి అధికారులు

వార్త 2లో



నెప్పల్లిలో ఉద్రిక్తత

● రోడ్డు పక్క ఇళ్ల తొలగింపునకు అధికారుల యత్నం ● అడ్డుకున్న బాధితులు

ప్రజాశక్తి - కంకిపాడు : కృష్ణాజిల్లా కంకిపాడు మండలం నెప్పల్లి గ్రామంలో రోడ్డు పక్కన నివసిస్తున్న 10 కుటుంబాల ఇళ్లను తొలగించేందుకు బుధవారం అధికారులు ప్రయత్నించారు. దీంతో బాధితులు నిరసనకు దిగడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే... నెప్పల్లి గ్రామంలో 10 కుటుంబాల వారు సుమారు 50 ఏళ్ల నుండి రోడ్డు పక్కన నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. వ్యవసాయ కూలి

ఇళ్లు తొలగించేందుకు యత్నిస్తున్న అధికారులు



పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఇటీవల జరిగిన (మిగతా 2లో)

మంగినపూడి బీచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



మంగినపూడి బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : మంగినపూడి బీచ్‌ను పూర్తిస్థాయి సౌకర్యాలతో పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం ఆయన... అధికారులతో కలిసి (మిగతా 2లో)


విజృంభిస్తున్న జ్వరాలు

❁ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపిల వద్ద గుంపులుగా జ్వరపీడితులు



మైలవరంలో ఆర్‌ఎంపి వద్ద గుంపులుగా ఉన్న జ్వర బాధితులు

ప్రజాశక్తి - మైలవరం : జ్వరాలతో ప్రజలు వణికిపోతున్నారు. మైలవరం నియోజకవర్గం లో రోజులు గడుస్తున్నా జ్వరాలు అదుపులోకి రాకపోగా, మరింతగా విజంభిస్తుండడంతోఆందోళన చెందుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్ లక్షణాలతో రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపిలు, పిఎంపిల వద్ద జ్వరపీడితులు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నారు. చిన్నారుల నుండి వద్ధుల వరకు జ్వరాల బారిన పడుతున్నారు. మైలవరం మండలం కనిమేర్ల, పోరాటనగర్, చంద్రాల, పుల్లూరు తదితర గ్రామాల్లో ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులంతా జ్వరపీడితులుగా ఉంటున్నారు. జ్వరం సోకిన రెండు రోజులకు తగ్గుముఖం పట్టినా కాళ్ల వాస్తున్నాయని, అరికాళ్లు మంటలుగా ఉంటున్నాయని, కీళ్ల నొప్పులు రోజుల తరబడి ఉంటున్నాయని బాధితులు వాపోతున్నారు. సాధారణ జ్వరం అయితే సరి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా బారిన పడితే ఇబ్బందులు తప్పదని పల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతోపాటు తాగే నీరు కలుషితం అవడంతో దోమలు విజంభించి జ్వరాలు అధికమవుతున్నాయి. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రోగాలు ప్రబలటానికి కారకాలుగా ఉంటున్నాయని అంటున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో పరిశుద్ధాన్ని మెరుగుపరచడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ వారు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.



చంద్రగూడెం ప్రధాన రహదారిపైనే నిలిచిన వర్షం నీరు

ఇంటిల్లిపాదీ జ్వరాలే

లావుడియా రాము, కనిమేర్ల తండా




మా గ్రామంలోని ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరికీ ఒకరి తర్వాత ఒకరికి జ్వరాలు వస్తున్నాయి. దీంతో వైద్య ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కూలి పనులు చేసుకునే వాళ్ళం డబ్బులు లేక, ఆస్పత్రుల చుట్టూ తిరగలేక అల్లాడిపోతున్నాం. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మంచినీళ్లు మురుకులుగా ఉంటున్నాయి. అధికారులెవరూ మా గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తపై స్పందించిన విఎంసి అధికారులు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ప్రధాన సెంటర్లలో వెలగని హైమాస్ట్ లైట్లకు బుధవారం విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేపట్టారు. "ప్రధాన సెంటర్లలో వెలగని హైమాస్ట్ లైట్లు - చీకట్లో రాకపోకలకు భయపడుతున్న ప్రజలు" శీర్షికతో బుధవారం ప్రజాశక్తి టాబ్లాయిడ్ 2వ పేజీలో ప్రచురితమైన వార్తపై విఎంసి అధికారులు స్పందించారు. జింఖానా గ్రౌండ్స్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఉన్న హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు పూర్తిచేశారు. బుధవారం రాత్రి ఆ సెంటర్‌లో లైట్లు వెలగడంతో ప్రజలు ఊపరిపీల్చుకున్నారు. అలాగే ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద గల హైమాస్ట్ లైట్లకు రాత్రి 10.30 గంటల సమయంలో మరమ్మతులు చేస్తున్నారు. కొద్దిసేపట్లో వాటి మరమ్మతులు కూడా పూర్తవుతాయని విఎంసి అధికారులు తెలిపారు.





ముత్యాలంపాడులో హైమాస్ట్ లైట్లకు మరమ్మతుల చేస్తున్న విఎంసి సిబ్బంది; జింఖానా గ్రౌండ్స్ వద్ద మరమ్మతులు చేయడంలో వెలుగులు విరజిమ్ముతున్న హైమాస్ట్ లైట్లు (కింద)

ఎల్‌జి ఓఎస్‌ఈడి సి4 సిరీస్ టీవీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎల్‌జి కంపెనీ వారి నూతన ఉత్పత్తి అయిన ఓఎస్‌ఈడి సి4 సిరీస్ టీవీని సాయి బాలాజీ ఎలక్ట్రానిక్స్ అధినేత ఎస్.రాకేష్ బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని ఏలూరు రోడ్ చుట్టుగుంట బిఎస్‌ఎన్‌ఎల్ భవన్ సమీపంలోని ఎల్‌జి షోరూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పరుచూరి కిషోర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ టీవీ రంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులను ఓఎస్‌ఈడీ సి4 సిరీస్ టీవీ తీసుకొస్తుందన్నారు. ఏఐ ఆధారంగా పనిచేయడంతోపాటు డాల్బీ విజన్, డాల్బీ అట్మాస్ లాంటి ఆడియో వీడియో విభాగాల్లో వినియోగదారులకు సరికొత్త అనుభవాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల్‌జి ఏరియా మేనేజర్ కూచిపూడి వంశీకష్ణ, మార్కెటింగ్ మేనేజర్ హేమంత్ పాల్గొన్నారు.



ఓఎస్‌ఈడి సి4 సిరీస్ టీవీని ఆవిష్కరిస్తున్న సాయి బాలాజీ ఎలక్ట్రానిక్స్ అధినేత ఎస్.రాకేష్

మొదటిపేజీ తరువాయి



నెప్పల్లి పంచాయతీ కార్యాలయంలో బాధితులతో చర్చిస్తున్న అధికారులు

నెప్పల్లిలో ఉద్రిక్తత

ఎన్నికలకు ముందు జరిగిన అగ్నిప్రమాదంలో వారి ఇళ్లు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి. పెద్దఎత్తున ఆస్తినష్టం జరిగింది. దీంతో పది కుటుంబాల వారు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో కంకిపాడు తహశీల్దారుతోపాటు అప్పటి గహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, మాజీ శాసనసభ్యులు బోడే ప్రసాద్ తదితరులు కొంత ఆర్థిక సాయం చేసి పూరి గుడిసెల స్థానంలో రేకులషెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో పది కుటుంబాలు వారు అప్పులు చేసి రేకుల షెడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికల అనంతరం గ్రామాల్లో గల రాజకీయ వైరుధ్యాల కారణంగా ఆ పది కుటుంబాలపై కక్షగట్టి కొందరు నాయకులు... అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మూడుసార్లు నోటీసులు నామమాత్రంగా ఇప్పించారు. బుధవారం ఏకంగా పోలీసుల బలగాలు, పొక్లయినర్‌తో కంకిపాడు తహశీల్దారు రామకృష్ణ, నెప్పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విఆర్‌ఒ సూరిబాబు తదితర అధికారులు వచ్చి షెడ్లను కూల్చివేసేందుకు ప్రయత్నించారు. ఆ ప్రాంతంలో భయానక వాతావరణం సృష్టించారు. బాధితులు అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో అధికారులు పంచాయతీ కార్యాలయంలో బాధితులతో చర్చించారు. గ్రామంలో రోడ్డు పక్కనే ఎక్కువ ఇళ్లు ఉన్నాయని, కానీ తమ ఇళ్లనే ఎందుకు తొలగిస్తున్నారని బాధితులు ప్రశ్నించారు. దీంతో అధికారులు రోడ్డుకు నాలుగు మీటర్లు ఖాళీ వదిలి నిర్మించుకోవాలని, ఇందుకు పది రోజులు గడువు ఇస్తున్నామని చెప్పి వెళ్లిపోయారు. కంకిపాడు ఎస్‌ఐ తాతాచార్యులు నేతృత్వంలో కంకిపాడు, ఉయ్యూరు పోలీసులు బందోబస్తుగా వచ్చారు.

బాధితులకు తగిన న్యాయం చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్ డిమాండ్

బాధితులకు అధికారులు తగిన న్యాయం చేయాలని సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అన్యాయమైన చర్యను అధికారులు ఆపాలని కోరారు. బాధితులకు నివాస స్థలాలు ఏర్పాటు చేసిన తర్వాతే ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న వేల్పుల ప్రశాంతి

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

ఉదయం కీసర నుండే ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మరో లారీని ఎర్రుపాలెం పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇవి మచ్చుకు రెండు సంఘటలే. పట్టుబడకుండా ఎన్నో లారీల ఇసుక రవాణా అవుతోంది.

కంచికచర్ల మండలం కీసర గ్రామంలోని ఇసుక నిల్వ పాయింట్ వద్ద జూలైలో లోడింగ్ ప్రారంభించారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గల ఈ ఇసుక నిల్వ కేంద్రం నుండి రెవెన్యూ, పోలీస్, మైనింగ్, పంచాయతీరాజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక లోడింగ్ జరుగుతోంది. ప్రతి రోజూ 170 నుండి 200 వరకు వాహనాల్లో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర టన్ను ఇసుకకు రూ.290 చొప్పున ఆన్‌లైన్ పేమెంట్ చేసిన వారి వాహనానికి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ట్యాంకర్‌కు 5 టన్నులు, 6 టైర్ల లారీకి 10 టన్నులు, 12 టైర్ల లారీకి 20 టన్నుల చొప్పున మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలనే నిబంధన ఉంది. ఇలా ప్రభుత్వం నిర్దేశించిన ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా జరగాల్సి ఉన్నప్పటికీ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులు, మీడియా ముసుగులో పలువురు సొంత విహనాలు ఏర్పాటు చేసుకొని ఇసుక దందాకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినబడుతున్నాయి. ఇసుక నిల్వ కేంద్ర వద్దకు వాహనాలు పంపి అధికారు పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులమని కొందరు, మీడియా ప్రతినిధుల పేరిట కొందరు ఎలాంటి డబ్బులు చెల్లించకుండా బెదిరించి మరీ పరిమితికి మించి వారి వాహనాలకు ఇసుక లోడింగ్ చేసుకుని వెళుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు కూడా చేసేదేమీలేక చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఇసుక నిల్వ కేంద్రం వద్ద ఇసుక లోడింగ్‌కు వచ్చిన వాహనం నెంబర్, ఆన్‌లైన్ పేమెంట్ చేసిన వాహనం డ్రైవర్‌కు రసీదు ఇస్తారు. పనిచేసే సిబ్బంది తమ రికార్డుల్లో ఆన్‌లైన్ పేమెంట్ చేసిన లారీ నెంబర్, రసీదు నెంబర్ నమోదు చేస్తున్నారు. డబ్బులు కట్టని అధికార పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధుల వాహనాల నెంబర్లు, రసీదు స్థానంలో వారి పేరు నమోదు చేస్తున్నారు. దీంతో ఇసుక దందా బయటపడింది. ఇందులో ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా ఇసుక దందాలో భాగస్వాములేనని పలువురు అంటున్నారు. గత నెలలో ప్రతిరోజూ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులు, కొందరు మీడియా ప్రతినిధులు తమ వాహనాల్లో ఇసుక దందాకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. ఇసుకకు డబ్బులు ఇవ్వకపోవడమే కాదు, ఏకంగా పరిమితికి మించి అధిక లోడింగ్ చేసుకుని యథేచ్ఛగా దందాకు పాల్పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇలా దందాకు పాల్పడుతూ లోడింగ్ చేసిన ఇసుకను విజయవాడ, హైదరాబాద్ తదితర చోట్లకు అక్రమంగా తరలిస్తూ ప్రతిరోజూ లక్షలాది రూపాయలు అక్రమంగా పోగేసుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నూతన ఇసుక పాలసీకి ఆదిలోనే తూట్లు పడుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కీసర ఇసుక నిల్వ కేంద్ర వద్ద జరుగుతున్న ఇసుక దందాపై విచారణ జరిపి, దందాకు పాల్పడిన వ్యక్తులు, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

నందిగామ నియోజకవర్గ పరిధిలో కష్ణానది, మునేరులలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. కంచికచర్ల మండలం మోగులూరు, గని ఆత్కూరు పరిధిలో రాత్రిపూట పలువురు లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని తెలిసింది. అలాగే మండలంలోని కీసర, నందిగామ మండలం కంచల పరిధిలో మునేటి నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసింది.

అధికార పార్టీ కనుసన్నల్లో ఇసుక దందా

జడ్‌పిటిసి వేల్పుల ప్రశాంతి

కంచికచర్ల మండలం కీసర ఇసుక నిల్వ కేంద్ర వద్ద జరిగే ఇసుక దందాను నివారించాలని కంచికచర్ల జడ్‌పిటిసి సభ్యులు వేల్పుల ప్రశాంతి అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన నూతన ఇసుక పాలసీకి పలువురు అధికార పార్టీ నాయకులు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. కీసర ఇసుక నిల్వ కేంద్ర వద్ద ఎంఎల్‌ఎ, ఎంపి అనుచరుల పేరుతో కొందరు, మీడియా ముసుగులో మరికొందరు డబ్బులు చెల్లించకుండా దౌర్జన్యంగా లారీలు, ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్ చేసుకొని దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారుల విచారణ జరిపి ఇసుక దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

మంగినపూడి బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

మంగినపూడి బీచ్ సందర్శించి, మౌలిక వసతుల కల్పన, బీచ్ అభివద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ 2014-2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం మంగినపూడి బీచ్‌కు ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు, బీచ్ పరిసర ప్రాంతాలను మెరకచేయడం వంటి అభివద్ధి పనులు చేసిందని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం బీచ్ అభివద్ధిని కొనసాగించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేయడానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు బీచ్‌ను అన్ని రకాలుగా అభివద్ధి చేసేందుకు అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. బీచ్‌లో ప్రైవేట్ భాగస్వామ్యంతో రిసార్ట్స్, వాటర్ స్పోర్ట్స్, ఇతర కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతోపాటు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమన్నారు. విద్యుత్ దీపాలు, సెక్యూరిటీ ఏర్పాటు చేసి బీచ్ సందర్శన సమయాలను పొడిగిస్తామని, అదేవిధంగా సందర్శకులకు బీచ్‌లో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఉండేందుకు ఫ్లోటింగ్ రోప్స్, రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు నుంచి ఆరు నెలల్లో బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈసమావేశంలో అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఆర్కిటెక్చర్ కిరణ్, పర్యాటకశాఖ జిల్లా అధికారి జి.రామ లక్ష్మణరావు, ఇన్చార్జి తహశీల్దారు సౌజన్య, వీఆర్వో గణేష్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడికి ప్రతి ఒక్క పోలీస్ అధికారి కృషి చేయాలని వీటి నియంత్రణలో ఎవరు నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు హెచ్చరించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటూ, ప్రతి ఒక్క పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కేసులలో సమగ్ర దర్యాప్తు చేసి, మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట సమయం లోపల బాధితులకు న్యాయం అందించేలా ప్రతి ఒక్కరు కషి చేయాలని ఆదేశించారు. మహిళలకు సంబంధించిన ఏ విషయ



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్‌పి ఆర్ గంగాధరరావు

మైనా సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ ను పరిరక్షించే విషయంలో అందరూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అయిన మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులను మొదటి ప్రాధాన్యంగా స్వీకరించి వాటిని పరిష్కరించాలన్నారు. డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తూ గంజాయి పై ఉక్కుపాదం మోపే దిశగా కషి చేయాలన్నారు. యువత మత్తు బారిన పడకుండా విద్యాలయాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కాలేజీల వద్ద పెద్దపెద్ద హెూల్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రహదారి ప్రమాదాల నివారణకు కషి చేయాలన్నారు. అలాగే జిల్లాలో ఉన్న చెక్ పోస్ట్ ల వద్ద నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలను కళాశాలలో, విద్యాలయాలలో యువతకు తెలియచెప్పాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి వెంకటేశ్వరరావు , అడిషనల్ ఎస్పీ ఏఆర్ ఎస్ వి డి ప్రసాద్ , డీఎస్పీలు అబ్దుల్ సుభాన్ , మురళీధర్ , జై సూర్య , శ్రీకాంత్ , సుభాష్ , నాగరాజు , రమేష్ , ఇన్స్పెక్టర్లు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు

ప్రజాశక్తి-చల్లపల్లి : వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ కోరారు. బుధవారం చల్లపల్లిలోని జాతీయ రహదారి -216కు ఇరువైపులా స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆధ్వర్యంలో 200 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్వచ్ఛ కార్యకర్తలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీ.ఆర్.కే.ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచటం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ టీ.పద్మావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి కుక్కర్ బహూకరణ

ప్రజాశక్తి-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య పుట్టినరోజు పురస్కరించుకొని ఒకరోజు ముందస్తుగా మండలంలోని దూళ్లవానిగూడెం అంగనవాడి కేంద్రంలో చిన్నారులకు వంటకు ఉపయోగపడే ప్రెజర్ కుక్కర్ను టిడిపి సీనియర్ నాయకుడు దూ ళ్ల జెమ్మీ బాబు తన సొంత నిధులు వెచ్చించి బహుమతిగా అంగనవాడీ కార్యకర్త పొనుగుమాటి జయప్రదకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు మధిర అభిమన్యుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫించన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ ఆగస్టు 1వతేదీ ఉదయం 5 గంటలకే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుండి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు నెలకు 2,40,939 మంది లబ్ధిదారులకు రూ.102.16 కోట్లు పంపిణీ చేయవలసి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులతో ఆగస్టు 1వతేదీ ఉదయం 10 గంటల లోపు 90 శాతం పైగా పంపిణీ పూర్తిచేసేలా ప్లాన్ చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని, ఆ ప్రకారం ఉదయం 5 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని, లబ్ధిదారుల ఇళ్ళ వద్దే పింఛన్లు అందజేయాలన్నారు. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేసి, ఇన్చార్జి సిబ్బందిని నియమించి, ఉదయం 3 గంటలకే విధులకు వచ్చి వేకప్ కాల్స్ చేసి, సచివాలయ సిబ్బందిచే పింఛన్ల పంపిణీ పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో కొన్ని సచివాలయాలను క్లస్టర్స్ గా ఏర్పాటు చేసుకుని, పింఛన్ల



పంపిణీలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా పర్యవేక్షించాలన్నారు. పింఛన్ల పంపిణీలో గత నెలలో కొన్ని మండలాల్లో ఎదురైన సమస్యలు పునరావతం కాకుండా చూడాలని, పింఛన్ల పంపిణీలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో ఉత్తమ ప్రగతి సాధించిన మొదటి 10 సచివాలయ సిబ్బందికి, మొదటి ముగ్గురు కమిషనర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ, డిఆర్‌డిఏ, ఇంఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ వి నాగేశ్వర నాయక్ పాల్గొన్నారు.

ఆస్తి, కుళాయి పన్నులపై రీసర్వే

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగరపంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారయణ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఏజెండాలో పలు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. శివాలయంలో రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ రూ.6.66 లక్షలతో మరమ్మతు పనులతో పాటు పలు అంశాలకు ఆమోదం లభించింది. 2021 నుంచి ఇప్పటివరకు నగరపంచాయతీ పరిధిలో జరిగిన అభివద్ధికి సంబంధించి వివరాలు తెలియజేయాలని వైస్ ఛైర్మన్ సోలె సురేశ్ వివరణ కోరారు. 14వ వార్డులో అసంపూర్తిగా నిలిచిన వాటర్ ట్యాంకు నిర్మాణం ఎందుకు నిలిచిపోయింది. ఎప్పుడు పూర్తవుతు ందని ప్రశ్నించారు. వారం రోజుల్లో పనులు గుత్తేదారు ప్రారంభించి రెండు నెలల్లో పూర్తిచేస్తారని ఏఈ జన్ను రాజేశ్ వివరణ ఇచ్చారు.

ఆస్థిపన్ను, కుళాయి పన్ను పై రీసర్వే

నగరపంచాయతీ పరిధిలో ఆస్థిపన్ను, నీటి పన్ను పై రీసర్వే చేపడుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సమావేశం దష్టికి తీసుకువచ్చారు. ఆస్థిపన్నుకు సంబంధించి పలు చోట్ల తేడాలున్నాయని దీనికై చేపడుతున్న సర్వేకు కౌన్సిలర్లు సహకరించాలన్నారు. ఆస్థిపన్ను వసూలు ముమ్మరం చేస్తామని దీనికి కూడా కౌన్సిలర్లు సహకరించాలని కోరారు.

ఎండుతున్న వరి పొలాలు

ప్రజాశక్తి- ఘంటసాల : ఘంటసాల గ్రామంలోని 3/2 ఛానల్ పంట కాలువలో నీరు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజుల క్రితం కురిసిన వర్షం నీటితో నాట్లు వేసినప్పటికీ కాలువలో నీటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ 3/2 ఛానల్‌కి నీటిని విడుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కాలవలో నీరు లేకపోవడం వల్ల నాట్లు చనిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని అధికారులను వేడుకుంటున్నారు.



ఎండిపోతున్న వరి నాట్లు



నీళ్లు లేక వెలవెల పోతున్న 3/2 ఛానల్ కాలువ



శిబిరంలో మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణయ్య

60 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం గ్రామంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా సంస్థ, వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా జడ్జి కె.వి రామకృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఎవరికి వారు తమ ఇళ్ల వద్ద శుభ్రం చేసుకోవాలని కోరారు. అనంతరం 60 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ తాసిల్దార్ కనకదుర్గ, జిల్లా సంక్షేమ అధికారి బి ప్రకాశరావు, ఆర్ ఐ షకీలా బేగం, వైద్య అధికారులు, ఆశలు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగిపై దాడి

ప్రజాశక్తి-కంకిపాడు : రిజిస్ట్రేషన్ పనులు చేపిస్తానని నమ్మ బలికి యాభై వేల రూపాయలు తీసుకొని రెండేళ్ల నుంచి తిప్పుతున్నాడని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఔట్సోర్సింగ్ ఉద్యోగిపై బాధితుడు పట్టపగలు కార్యాలయంలోనే కత్తితో దాడి చేసిన ఘటన కంకిపాడులో బుధవారం తీవ్ర కలకలం రేపింది. కంకిపాడు ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన అబ్దుల్ రెహమాన్ తనకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పనినిమిత్తం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అటెండర్ గా పనిచేస్తున్న శ్రీనివాస రావుకు రెండేళ్ల క్రితం 50 వేలు ఇచ్చాడు. అప్పటి నుంచి పనిచేయకపోవడంతో రెహమన్ శ్రీనివాసరావుపై కోపం పెంచుకొని బుధవారం కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన శ్రీనివాసరావును సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ బుధవారం తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరచిన గోదాం వద్ద ఏర్పాటు చేసిన సెక్యూరిటీ, గోదాంకు వేసిన తాళాలు, వాటి సీళ్ల కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్‌ల వద్ద సీసీ కెమెరాలు పనిచేస్తున్నది లేనిది ఆరా తీశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నెలవారి తనిఖీల్లో భాగంగాకలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ సమన్వయ విభాగం డిటి శ్యామ్ ఉన్నారు.

వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : రాష్ట్రప్రభుత్వానికి పెనుభారమైన వలంటీర్ల వ్యవస్థను రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ అన్నారు. ఆకునూరు ఆయన నివాసంలో బుధవారం విలేకరుల సమా వేశంలో ఆయన ఆమట్లాడుతూ వలంటీర్ల వ్య వస్థను రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ ల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఇటీవల ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. పార్టీకి ఉపయోగపడేందుకు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వ లంటీర్ల వ్యవస్థ వల్ల ప్రస్తుత ప్రభుత్వంపై భారం తప్ప ఒరిగేదేమీ లేదన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లు లేక పోయినా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పించన్లు గ్రామ, వార్డు సచి వాల సిబ్బంది ఏవిధమైన ఇబ్బంది లేకుండా పంపిణీచేస్తున్నారని పేర్కొన్నారు.

సత్యనారాయణ మృతదేహానికి నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : బెరాక ప్రార్థన మందిర వ్యవస్థాపకులు బట్లంకి సత్యనారాయణ భౌతిక గాయానికిటిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ బుదవారం నివాళులర్పించి వారి కుమారులు కిరణ్ పాల్ ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు,నాయకులు కర్రి మహేష్,పాల సురేష్, జనసేన టిడిపి నాయకులు పాల్గొన్నారు.





పశ్చిమ తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ పశ్చిమ మండలం తహశీల్దార్‌గా పనిచేసిన కిషోర్ బాబుకు బుధవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన ఎన్నికల సమయంలో బాధ్యతలు స్వీకరించి సమర్థవంతముగా విధులను నిర్వర్తించారు. అయితే కిషోర్‌బాబును ప్రభుత్వం బదిలీ చేసిన సందర్భంగా పశ్చిమ తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు శ్రీనివాసరావు, అప్పారావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫణి, జూనియర్ అసిస్టెంట్ గిరీష్, విఆర్వోలు సిరివెన్నెల, ఇంద్రజ, సాహిత్య, అరుణ పాల్గొన్నారు.

వెస్ట్‌జోన్ ఏసిపి బదిలీ



ప్రజాశక్తి-వన్‌టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బుధవారం పలువురు డిఎస్పీలను బదిలీ చేసింది. అందులో భాగంగా విజయవాడ వెస్ట్‌జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) మురళీకృష్ణారెడ్డి బదిలీ అయ్యారు. మురళీకృష్ణారెడ్డిని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో బుధవారం ప్రత్యేక అధికారి, ఐసిడిఎస్ పీడీ కె.ఉమాదేవి పర్యటించారు. అంగన్ వాడీ కేంద్రం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గ్రామంలో పలు రోడ్లు, డ్రైయినేజీలు పరిశీలించారు. వసతులు కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ రేణుక, గ్రామ సర్పంచ్ పెసరమల్లి సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-తిరువూరు: ప్రతి విద్యార్థి రోడ్డు భద్రతా నియమాలను తెలుసుకుని, వాటిని తప్పకుండా పాటించాలని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. ఆదిలక్ష్మి సూచించారు. బుధవారం పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మద్యం సేవించి లేదా సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహ నాలపై ప్రయాణించడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమా దాలు జరుగుతున్నాయని వివరించారు. ఎట్టి పరిస్థితు లలోనూ చిన్న పిల్లలు వాహనాలను తోలవద్దని తెలిపారు. జెవివి నాయకులు ఎం.రాంప్రదీప్, డి.సుదర్శన్, సీనియర్ ఉపాధ్యాయుడు వి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్‌లో కార్తీషా ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 26 నుంచి 28 వరకు విజయవాడ పడమట సిహెచ్ఆర్‌కె ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా లెవెల్ బాడ్మింటన్ టోర్నమెంట్ (డబుల్స్)లో అండర్-17 కేటగిరిలో మూడవ, అండర్-19 కేటగిరిలో రెండో స్థానాన్ని పట్టణంలోని నాగార్జున హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని బి.కార్తీషా సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఆషాఢం సారె సమర్పణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఆషాఢమాసం ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించారు. వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, తులసి అర్చన కార్యక్రమం అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని గణపవరం మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. అంజన్న సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేయగా ఐదుగురితో పాటు ఆరు మోటార్ సైకిళ్లు, 4,560 రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కంటి శుక్లాలతో అంధత్వం

నేత్ర వైద్యనిపుణులు ఉమా యోగేష్



ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ: అంధత్వానికి ప్రధాన కారణంగా కంటి శుక్లాలే నిలుస్తున్నాయని, కంటి శుక్లాల శస్త్ర చికిత్స నిపుణులైన నేత్ర వైద్యుని పర్యవేక్షణలోనే జరగాలని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ఉమా యోగేష్ తీగలే తెలిపారు. విజయవాడలోని కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం కంటి శుక్లాలు, చికిత్సలు, అంధత్వం అనే అంశంపై జరిగిన వైద్య సదస్సులో డాక్టర్ మాట్లాడుతూ శుక్లాలు ప్రధానంగా కంటిలో వయసు సంబంధిత మార్పుల వల్ల కలుగుతాయన్నారు. మధుమేహం, మూత్రపిండ వ్యాధి, గ్లాకోమా, కంటి గాయాలు, ఇన్ఫెక్షన్లు, కంటి లోపల వాపు, ఓవర్ ది కౌంటర్ మందులు, ధూమపానం యొక్క దీర్ఘకాలం కూడా కంటిశుక్లం అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. జన్యుపరమైన లేదా జీవక్రియ లోపాలు, ఇన్ఫెక్షన్లు లేదా గాయం కారణంగా శిశువులు లేదా చిన్న పిల్లలలో కూడా కంటిశుక్లం సంభవించవచ్చునని, పిల్లలలో, లక్షణాలు కంటిలో తెల్లగా కనిపించడం (ల్యూకోకోరియా), మెల్లకన్ను కనుబొమ్మల అసంకల్పిత వణుకు వంటివి కలిగి ఉండవచ్చునన్నారు. స్టెరాయిడ్లను కలిగి ఉన్న ఓవర్-ది-కౌంటర్ మందులు కంటిశుక్లాలకు కారణమవుతాయని, ప్రజలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను ఉపయోగించినప్పుడు, వారు తెలియకుండానే స్టెరాయిడ్ మందులకు గురవుతారన్నారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల కూడా కంటిశుక్లం ఏర్పడుతుందన్నారు. అనుభవజ్ఞుడైన నేత్ర వైద్యుడిచే కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించడం చాలా ముఖ్యం అని, ఒక అనుభవజ్ఞుడైన నేత్ర వైద్యుడు శస్త్రచికిత్స సమయంలో తలెత్తే సమస్యలైన కంటి అనాటమీ లేదా అధునాతన కంటిశుక్లం వంటి సమస్యలను ఎదుర్కోగలుగుతారని చెప్పారు.


విద్యా రంగ సమస్యలను పరిష్కరించండి : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి-నందిగామ: విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు నందిగామ ఆర్డీవో రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న నాడు నేడు పనులు పూర్తి చేయాలని, స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్, మెస్ ఛార్జీలు విడుదల చేయాలని కోరారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాలని కోరారు. డిగ్రీ విద్యలో ఆన్లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలన్నారు. పాఠశాల విద్యలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో ప్రాథమిక విద్యకు ఉరితాడుగా మారిందని, తక్షణమే రద్దు చేయాలని, విలీనం అయిన పాఠశాలలను తిరిగి యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ ఖజా, ప్రమోదర్, వెంకటేష్, అభిషేక్, నరసింహారావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు సురక్షితమైన త్రాగునీటినే సరఫరా చేసేటట్టు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గురువారం నగరంలోని డాక్టర్ కె ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ ను పరిశీలించిన అనంతరం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ - విద్యాధరపురం, హెచ్ బి కాలనీ, గాంధీజీ మహిళా కళాశాల దగ్గర జరుగుతున్న అన్న క్యాంటీన్ల పునః నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆ తరువాత హనుమాన్ పేటలోని వెహికల్ డిపోను సందర్శించి అక్కడ వాహనాలు, శానిటేషన్ పరికరాలు, ఇతర మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, యస్ ఈ రామ్మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రసాద్, వెంకటేశ్వర రెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం ఎంపిడిఓగా చెన్నయ్య



ప్రజాశక్తి-గంపలగూడెం: గంపలగూడెం ఎంపిడిఓగా ఎం.చెన్నయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చెన్నయ్యకు ప్రస్తుతం ఎంపీడీవోగా కొనసాగుతున్న టీవీఎస్ నాగేశ్వరరావు బాధ్యతలు అప్పగించారు. చెన్నయ్య ఏపి హైకోర్టులో విధులు నిర్వహిస్తూ, పరిపాలన చర్యల్లో భాగంగా గంపలగూడెం వచ్చినట్లు చెప్పారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గరికపాడు డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కృష్ణంరాజు అధ్యక్షతన డాక్టర్ ఆర్.ప్రభావతి ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు పండ్లు, కూరగాయలలో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన గ్రామీణ మహిళలకు సర్టిఫికెట్లను ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కృష్ణంరాజు, ప్రభావతి చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల పేరుతో చెట్లను నరకొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-తిరువూరు: రోడ్డు ఆక్రమణల పేరుతో నగర పంచాయతీ అధికారులు పెద్ద చెట్లను నరకడం ఆపాలని సిపిఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం డిమాండ్ చేశారు. తిరువూరు మధిర రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు చెట్లను నరకడం దుర్మార్గమన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధికారులు సహకరించాలని కోరారు. షాపులను తొలగిస్తే దాన్ని వెంటనే ఏర్పాటు చేసుకోవచ్చునుగానీ చెట్లను నరికితే దాన్ని నిలబెట్టలేమని పేర్కొ న్నారు. నగర పంచాయతీ అధికారులు చెట్లు నరకడం వెంటనే నిలుపుదల చేయాలని ఆయన కోరారు.

ఆక్రమణల తొలగింపునకు గడువు ఇవ్వాలి

తిరువూరు పట్టణ ప్రధాన రహదారిలో ఆక్రమాల తొలగింపు విధించిన గడువు పొడిగించాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజును చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్‌రావు కోరారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన గంగాధరరావు వ్యాపారుల సమస్యలు వివరించారు. డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడంతో చిరువ్యాపారులు ప్రత్యామ్నాయం లేక ఇబ్బంది పడుతున్నారని, వారి దుకాణాలను తరలించేందుకు నెల రోజులు అవకాశం కల్పించాలని కోరారు. మరోక పక్క డ్రైనేజీలపై ఆక్రమాల తొలగింపుకు నగర పంచాయతీ ఆదేశాలు ఇచ్చిన గడువు పొడిగించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు సిపిఐ నాయకులు నాగుల్ మీరా, ఉదయ్, అశోక్, సుభాని వినతిపత్రం అందజేశారు.





నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీపురం నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం గౌరవ సలహాదారులుగా రామేశ్వరరావు నారాయణ, సంఘం అధ్యక్షులుగా కాపారపు శ్రీనివాసరావు, సంఘం ప్రధాన కార్యదర్శిగా కోడమంచలి గిరి, ఉపాధ్యక్షులుగా పెదపూడి హేమంత్, సహాయ కార్యదర్శిగా ముంగంటి రాజ్‌కుమార్, కోశాధికారిగా సుందరపల్లి దాసు, సహాయకోశాధికారిగా కాపారపు గౌతమ్‌ను ఎన్నుకున్నారు. మొత్తం 27 మందితో నూతన కమిటీ ఎన్నిక అయ్యింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ద్రాక్షారపు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కేసనకుర్తి ఈశ్వరరావు, శ్రీ కనకదుర్గ విజయవాడ నాయి బ్రాహ్మణ క్షౌరవత్తిదారుల సంఘం అధ్యక్షులు నవిరి మహేష్ పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భవానీపురం

కేన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆర్థిక సాయం అందజేశారు. విద్యాధరపురం కుమ్మరిపాలెంకు చెందిన లింగంశెట్టి సత్యనారాయణ కేన్సర్‌తో బాధపడుతూ ఎయిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుని భార్య పుట్టమ్మ సహాయం చేయాలని ఎమ్మెల్యేని కోరగా, తక్షణమే కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి. రూ. 5 వేల నగదును బుధవారం కుటుంబ సభ్యులక ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి అందజేశారు. అలాగే ఆర్టీసీ వర్క్ షాప్ ప్రాంతంలోని మాధవి అనే గృహిణి ఆరోగ్యం బాగోలేదని మందుల నిమిత్తం సహాయం కోరగా రూ. 2 వేలు సాయం చేశారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంకు చెందిన అన్నదాన విభాగం వారు ఆషాఢ మాసం సందర్భంగా దుర్గమ్మకు సారెను బుధవారం సమర్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు వారికి స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కార్యనిర్వాహణాధికారి లీలాకుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమాదేవి, ఏఈఓలు పి.చంద్రశేఖర్, ఎన్.రమేష్, అన్నదానం పర్యవేక్షకులు హేమ పాల్గొన్నారు. దుర్గగుడిలో నిత్యాన్నదానానికి కాకినాడకు చెందిన తేజోమూర్తుల సూర్యకుమార్ 1,166 యుఎస్ డాలర్లను అన్నదానానికి విరాళంగా అందజేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్నేహితుల దినోత్సవ వేడుకలు చిట్టినగర్ నగరాల కళ్యాణ మండపంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నగరాల శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం కమిటీ కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, నగరనాడు రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన స్నేహితుల దినోత్సవం వేడుకలో తొలుత కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకుంటు స్నేహితుల మధ్య ఉన్న పవిత్ర బంధం గురించి వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు పిళ్లా శ్రీనివాసరావు, పోతిన వరప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోతిన శ్రీనివాసరావు, పోతిన ధర్మారావు, పణుకు రమేష్, మజ్జి శ్రీనివాసరావు, మంజుభార్గవి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లిలోని స్నేహపురి కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంను బుధవారం స్త్రీ, శిశు సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి తనిఖీ చేసారు. లబ్ధిదారులకు ఇచ్చే సరుకుల నాణ్యత పరిశీలించారు. యాప్‌లో ఏ విధంగా ఎంటర్ చేస్తారనే విషయాలు పరిశీలించారు. ప్రి స్కూల్ సిలబస్ ప్రకారం జరుగుతుందా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిడియు సువర్ణ, సిడిపి ఓపి వెంకటలక్ష్మి, సూపరవైజర్ సిహెచ్ నాగ పద్మావతి,టీచర్ యు స్వప్న పాల్గొన్నారు.

పెడన మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి- పెడన : స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కటకం నాగ కుమారి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. అజెండాలోని 23 అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ ప్రకటించిన వార్డు ఇన్చార్జిల నియామకాలపై మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పరోక్ష విమర్శకు దిగారు. వార్డు ఇన్చార్జిల పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ పర్యటనను అభ్యంతరం తెలియజేస్తూ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ప్రజా క్షేత్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్‌కి సమాచారం లేకుండా మున్సిపల్ కమిషనర్ వార్డ్ పర్యటనపై కౌన్సిలర్లు అభ్యంతరం చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మౌఖిక ఆదేశాల మేరకు ఎన్నికల సిబ్బంది వసతికి సంబంధించిన బిల్లులను కౌన్సిల్ ఎజెండాలో చేర్చారు. తప్పనిసరి నిర్వహణ బాధ్యతలు ఉండటం వలన అత్యవసర సమావేశంలో పెట్టినట్లు ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ కౌన్సిల్ సభ్యులకు వివరణ ఇవ్వాలని కమిషనరుకు సూచించారు. కాగా సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యేక అధికారి పాలన గనుక కౌన్సిల్ డిజార్డర్‌లో ఉన్న నేపథ్యంలో జరిగిన తప్పనిసరి ఖర్చులను జమ చేయాలని కమిషనర్ బి వెంకటరామయ్య వివరణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు చెందిన పలు బిల్లులను జనరల్ ఫండ్ నుండి విడుదల చేసేందుకు ఇదే అంశంపై12వ వార్డు కౌన్సిలర్ మట్ట శివ పావని యధావిధిగా డెసెంట్ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- డిఎంహెచ్ఒ డాక్టర్ జి.గీతాబాయి

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఛాంబర్‌లో పిసిపిఎన్డిటి చట్టంపై బుధవారం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లా డుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా ప్రతి ఐదు సంవత్సరములకు ఒకసారి రెన్యువల్ చేయించు కోవాలన్నారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో ధరల పట్టికను, హెచ్చరిక బోర్డులను తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో తనిఖీ టీంలను ఏర్పాటు చేసి వారి ద్వారా తనిఖీలు నిర్వహించి చట్టాన్ని అతిక్రమించిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. జనాభాలో స్త్రీ పురుష లింగ నిష్పత్తులలో వ్యత్యాసం లేకుండా ప్రజలలో క్షేత్రస్థాయి



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ గీతాబాయి

సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తామని, చట్టాన్ని అధికమించిన ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైద్యులు వై .మహేష్, ఎన్ .అమత, పి .చాందిని, డాక్టర్ ఐ .వినీల్ ,స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కే.సుశీల, ఎన్ . ధర్మతేజ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు జట్లు ఎంపిక



ఎంపికైన జట్టు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గం ప్రసాదంపాడులోని సెంట్ ఆన్స్ సీబీఎస్సీ పాఠశాలలో బుధవారం కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలను ఘనంగా నిర్వహించినట్లు కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ సంఘ కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన విద్యార్థులు చిత్తూరు జిల్లా కుప్పంలో ఆగస్టు 10, 11 వ తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో కష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఉమ్మడి కష్ణాజిల్లా నుంచి సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరైనట్లు ఆయన తెలిపారు. అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన జట్టు నుండి జాతీయస్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహిస్తారని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షూటింగ్ బాల్ క్రీడకు ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, రాష్ట్రంలో ప్రతి జిల్లాల్లోనూ, ప్రతి గ్రామంలోనూ విద్యార్థులు షూటింగ్ బాల్ క్రీడను ఆడుతున్నారని అన్నారు. ఈ పోటీలకు పరిశీలకులుగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నూతలపాటి జగదీష్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు షఉటింగ్ బాల్ క్రీడలో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ అరుణ మేరీ, వ్యాయామ ఉపాధ్యాయులు జలసూత్రం వెంకట్రావ్, యుఎఫ్ఓ అధినేత బొల్లెద్దు బాగరాజు, పీఈటీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి నాగపడగ బహూకరణ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గుంటూరుకు చెందిన గోరంట్ల వేణునాథ్ ఒక కేజీ వంద గ్రాముల వెండి నాగపడగను (విలువ సుమారుగా 1,10,000 రూపాయలు) ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు బుధవారం అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.



వెండి నాగపడగ బహూకరిస్తున్న దృశ్యం

ఉద్యోగ విరమణ సత్కారాలు



పెదపారుపూడి మండలంలో లక్ష్మీకుమారి దంపతులను సన్మానిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు, ఎంఎల్‌ఎ వర్ల




గుడ్లవల్లేరులో బొర్రా రాంబాబును సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెదపారుపూడి : ఎలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన సురపనేని లక్ష్మీకుమారి ఉద్యోగ విరమణ సభా ఆ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రావెళ్ల వరుణ కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సభకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, కష్ణ గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావులు పాల్గొని బుధవారం లక్ష్మీకుమారి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు సూర్పనేని వెంకట సత్యనారాయణ, అంగుళూరు డైట్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి వెంకటేశ్వరరావు, ఎంఈఓ బొడ్డు శ్రీనివాస్, సర్పంచ్ కొల్లూరి అనూష, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఆఫీస్ సబార్డినేటర్గా అత్యుత్తమ సేవలు అందించడం అభినందనీయమని జనవరుల శాఖ డి ఇఇ బి.గణపతి అన్నారు. స్థానిక జన వనరుల శాఖ సబ్ డివిజన్ లో రాంబాబు పదవీ విరమణ సభను బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ రాంబాబు జన వనరుల శాఖలోని అనేక ఆఫీసుల్లో ఆయన ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం జన వనరుల శాఖ ఎఇఇ సాదిక్, ఎఇ నాగేశ్వరరావు, రిటైర్డ్ ఇఇ సుబ్రహ్మణ్యం, అధికారులు, సిబ్బంది, బంధుమిత్రులు రాంబాబుకు ఆయన సతీమణికి నూతన వస్త్రాలు బహుకరించి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి- పెడన : పెడన మండల పరిధిలోని ఉరివి గ్రామపంచాయతీ వీఆర్వోగా పనిచేస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు పదవీ విరమణ అభినందన సభ తొమ్మిదవ వార్డ్‌లోని తోటమాల్‌లో ఉన్న ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పరసా గోవిందరాజులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మణికుమార్, ఇన్చార్జి తాసిల్దార్ కాగిత పూర్ణచంద్రరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు బంధువులు పాల్గొన్నారు.



అనుమోలు ప్రభాకర్‌రావును సత్కరిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

అనుమోలు ప్రభాకర్‌కు సత్కారం

ప్రజాశక్తి-కంకిపాడు : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిన తరుణంలో ఆఫ్రికాలోని టాంజానియాలో ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి అక్కడ మన జాతీయ జెండాతో పాటు టిడిపి జెండాను కూడా తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు ఎగురవేసి యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం టిడిపి నియోజక వర్గ కార్యాలయానికి చేరుకొన్న అనుమోలు ప్రభాకర్ రావును పెనమలూరు నియోజక వర్గ శాసన సభ్యులు. బోడె ప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలోకోయ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మినేని నిష్ణాత్‌ను అభినందిస్తున్న దృశ్యం

విద్యావికాస్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా నిష్ణాత్

ప్రజాశక్తి - గుడివాడ : విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు కుమారుడు నిష్ణాత్ నూతన అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా బుధవారం పదవిని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యావికాస్ డైరెక్టర్లు ముప్పాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావులు మాట్లాడుతూ నిష్ణాత్ ఉన్నత విద్య అయిన ఛార్టర్డ్ అకౌంటెన్సీని పూర్తిచేసుకుని విద్యావికాస్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వదవిని స్వీకరించడం పాఠశాల ఉన్నతికి ఉపయెగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి పాలిటెక్నిక్ అధినేత ఎస్.రమణ, వికాస్ రెయిన్‌బో స్కూల్ ప్రిన్సిపల్ పి.రామ చంద్రశేఖర్, ప్రముఖులు ఎం.కృష్ణారెడ్డి, జి.పుల్లరెడ్డి, ఆశీర్వాదం, ఉమాదేవి, విజయలక్ష్మీ, ఎన్.కృష్ణారావు, జి.వెంకటేశ్వరరావు, వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తుట్టగుంటలో పశు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : కృష్ణా మిల్క్ యూనియన్ ఖాతా దారుల పశువులకు వైద్యం అందిం చేందుకు ప్రతినిత్యం గ్రామాలకు మెబైల్ వ్యాను ద్వారా వెళ్ళి వైద్యసేవలు అందిస్తున్నట్లు అని డాక్టర్ గంగా భవాని అన్నారు. బుధవారం మండలంలోని తుట్టగుంట గ్రామంలో పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవానీ మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ ఖాతాదారులకు పశు పోషణ కోసం నిరంతరం అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలూ ఇస్తున్నట్లు తెలిపారు. పశువులకు అత్యవసర చికిత్స అవసరమయితే రైతుల సమాచారం మేరకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అదే విధంగా వైద్య నిపుణుల సలహాలతో ఏ విధమైన కల్తీ లేని నాణ్యమైన ఫీడ్ ఉత్పత్తి చేసి కృష్ణా మిల్క్ యూనియన్ రైతులకు అందిస్తున్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యా రంగ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-తిరువూరు: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలు సత్వర మే పరిష్కారం చేయాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు తిరువూరు మండల విద్యాశాఖ అధికారి శ్యామ్ సుందర రావుకు,



తహశీల్దార్ కార్యాలయంలో అర్‌ఐ సురేష్‌బాబ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అమలు జరిపిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం సడలిపోతుందని, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్య మైపోతున్న పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని చక్కదిద్దాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చా శ్రీనివాసరావు, వినయ్‌కుమార్, నాగేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వరరావు, రాంబాబు, అపర్ణ, భారతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి-విజయవాడ: సింగ్‌నగర్ 62వ డివిజన్ రాధానగర్ కళాశాల ఎదురుగా ఏడు అపార్టుమెంట్స్ మధ్యలో ప్రమాదాలకు



నిలయంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు కోరారు. అపార్టుమెంట్స్ ప్రాంతంలో పాటు ప్రమాదకరంగా తయారయిన ట్రాన్స్‌ఫార్మర్, ఇటీవల ప్రమాదానికి గురైన కుంభా ద్వారక్‌లను నాయకులు కలిసి, పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, ఎం. రామాంజనేయులు, జల్లా నాగరాజు, పి.పున్నారావు, తమ్ము నాగరాజు పాల్గొన్నారు.

రెహమాన్‌కు సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: జిల్లా ఖజానా శాఖ ప్రధాన అధికారిగా బాధ్యతలు నిర్వహించి రిటైర్ అయిన రెహమాన్ సత్కార



కార్యక్రమం గాంధీనగర్‌లోని ఎన్జిజీవో హోమ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్జిజిఓ సంఘం అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, శ్రీనివాసులు నాయక్, డిఎస్ఎన్ రెడ్డి, ఎస్.రవికుమార్, వి.సుబ్రహ్మణ్యం, పి.కిరణ్‌కుమార్, గోపాల్ సింగ్, దాలినాయుడు పాల్గొన్నారు.

డ్రైనేజీల పరిశీలన

ప్రజాశక్తి-విసన్నపేట: ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రైనేజీలను బుధవారం తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విసన్నపేట ఎస్సై జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-వన్‌టౌన్: డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దగ్గరైతే ఉజ్వల భవిష్యత్తు, జీవితం నాశనమవుతుందని విజయవాడ వెస్ట్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ పీ. మురళీకష్ణారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు, చలువాది మల్లిఖార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల్లో బుధవారం మాధకద్రవ్యాల నివారణ, సైబర్‌క్రైమ్ అంశాలపై అవగాహనా సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌సిఎంఆర్ ఇసిఇ హెచ్‌ఓడి రంగారావు, కొత్తపేట సీఐ టీ. గణేష్, సైబర్ క్రైమ్ సిఐ శ్రీను, ఎస్ఐ రాజ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సైబర్ నేరాలు, మరియు డ్రగ్స్ వినియోగం విద్యార్థులపై చూపే ప్రభావం అనే అంశాలపై డాక్టర్ జాకీర్ హుస్సేన్



కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సిఐ ఎం సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులను బృందాలుగా ఏర్పడి అధికారులు పరిశీలించారు. నెమలి, కొనిజర్ల, గొల్లపూడి, చింతలనర్వ గ్రామాల్లో అధికారులు పర్యటించారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్ ప్రారంభం నుండి నీటి సరఫరా జరుగుతున్న చివరి భాగం వరకు పరిశీలించారు. అలాగే పబ్లిక్ టాపుల ద్వారా సరఫరా అవుతున్న నీటిని ఏ స్థాయిలో వినియోగిస్తున్నారు అనే విషయాన్ని గుర్తించారు. అదేవిధంగా గ్రామంలో 12 మంది కుటుంబాలను కలిసి వాటర్ పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్లడైన అంశాలను జలజీవన్ మిషన్ ఉన్నత అధికారులకు నివేదించనున్నట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రతినిధులైన శ్రీధర్, రాజభరత్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఖాజావలి పటాన్, కార్యదర్శి బాణాల దేవేంద్ర చారి, ఉపసర్పంచ్ మరీదు బజారు, గ్రామ నాయకులు వై పుల్లయ్య చౌదరి, చంద్రం, ఏఎన్ఎం లావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి అడవి క్వారీలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ నందు సీయోను మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు స్టేషనరీ పంపిణి చేశారు. ముఖ్య అతిథిగా అమెరికా దేశము నుండి వచ్చిన సిస్టర్ అలెక్సు పాల్గొన్నారు. ముఖ్య అతిధులుగా పాస్టర్ మోగులూరి సుశేశ్వరరావు, బ్యాల, ఎమ్ రాజేష్, బి పాపారావు, ఏ బాబు, పి కిరణ్ కుమార్, పి.ఉషా కిరణ్, హెచ్ఎం జ్యోతి పాల్గొని పిల్లలతో కొన్ని విషయాలు పంచుకున్నారు. తదుపరి డైరెక్టర్ మోగులూరి సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమ శిక్షణతో శ్రద్ధలతో విద్యను అభ్యసించాలని ఉన్నత స్థాయికి ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

రైటప్: గైబువలి పొటో వాడగలరు...

హిందీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడే వివిధ పాఠశాలలో మిగతా సబ్జెక్టుల



ఉపాధ్యాయులతో సమానంగా హిందీ ఉపాధ్యాయులు లేరనీ, దీనివలన పాఠశాలలో హిందీ భాష బోధనలో సరైన న్యాయం విద్యార్థులకు జరగడం లేదని హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...మోడల్ స్కూల్స్, కె.జి.బి.వి.లలో ఒక్క పి.జి.టి. హిందీ పోస్టు కూడా లేదని, వెల్ఫేర్ స్కూల్స్, జూనియర్, డిగ్రీ కాలేజీలలో తొంబై శాతం పైగా హిందీ అధ్యాపకులు లేరని వివరించారు. రాబోయే డిఎస్సీలో పాఠశాలలో అవసరమైనన్ని హిందీ ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొండపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆత్మరక్షణ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ జి రమాదేవి విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో యాక్ట్ పై డిజిటల్ వీడియో ప్రదర్శన ద్వారా చూపించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పద్మ లత, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు పి సబిత, ఆర్.కృష్ణకుమారి, జి.అరుణ, అంగన్వాడీ హెల్పర్ వి.భవానీ పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కూలింగ్ కెనాల్‌లో మంగళవారం గుర్తు తెలియని మృతదేహంగా లభ్యమైన వ్యక్తి విజయవాడ ఆటోనగర్‌లోని టాటా మోటార్స్ కంపెనీలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న రవిబాబుగా గుర్తించారు. రవిబాబు, తుమ్మలపాలానికి చెందిన ఇసుకపల్లి యాకోబు రాజు ఇద్దరూ మంచి మిత్రులు. యాకోబు రాజు మరణించినందున అతని అంత్యక్రియలకు కుటుంబంతో కలిసి రవిబాబు వచ్చాడు. అప్పటి నుంచి రవిబాబు ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా ఉంటున్నట్లు, సుమారు ఒంటిగంటకు అందరు పనుల్లో ఉండగా ఇబ్రహీంపట్నం కూలింగ్ కెనాల్‌లో దూకినట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి-తిరువూరు: మహిళను మోసం చేసిన కంభంపాటి నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కోకిలంపాడు గ్రామానికి చెందిన నాగరాజు మండలంలోని రోలుపడి గ్రామానికి చెందిన ఒక వితంతు మహిళను మాయమాటలతో మోసం చేసి, డబ్బులు తీసుకుని తనను పెళ్లి చేసుకోమని వెంటపడి వేధిస్తునట్లు ఆమె చేసిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నాగరాజును తిరువూరు కోర్టులో బుధవారం హాజరుపర్చామని చెప్పారు. న్యాయమూర్తి ఆగస్టు 14వ తేదీ వరకు జ్యూడిషల్ రిమాండ్ విధించగా నూజివీడు జైలుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

జగ్గయ్యపేటకు కృష్ణాజలాలు అందించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పదో వార్డ్ కౌన్సిలర్ కన్నబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గల పాత మోటర్ల వల్ల పూర్తిస్థాయిలో ప్రజలకు కృష్ణా నీరు అందట్లేదని తెలిపారు. పంప్ హౌస్ వద్దకు తమ కౌన్సిలర్లతో స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్‌రాజగోపాల్ తాతయ్య స్వయంగా పర్యటించి ఈ సమస్యకు పరిష్కరించాలని పట్టుదలతో కొత్త మోటర్లు కొరకు 45 లక్షలు రూపాయలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కౌన్సిలర్ నూకల సాంబ మాట్లాడుతూ పురపాలక సంఘం గోడ పగలగొట్టి బడ్డీకొట్టు ఏర్పాటు చేసిన అక్రమలను తొలగించని మునిసిపల్ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగమల్లేశ్వరరావు డిఇఇ కోటేశ్వరరావు శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఐద్వా 22వ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయవాడ: మహిళలు సంఘటితంగా నిలిచి తమ హక్కులను సాధించుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు కె సరోజ అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్ ఐద్వా మహాసభ మానికొండ భవన్‌లో బుధవారం జరిగింది. ముందుగా ఐద్వా జెండాను సరోజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలపై, ముఖ్యంగా చిన్న పిల్లలపై సైతం అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, ఇతర దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలని, అందుకు ఐద్వా అండగా నిలుస్తుందని అన్నారు.

పది మందితో నూతన కమిటీ

అనంతరం ఐద్వా నూతన డివిజన్ కమిటీ పది మందితో



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న సరోజ

ఏర్పడింది. డివిజన్ అధ్యక్షులుగా తాత రోశమ్మ, కార్యదర్శిగా వి.దమయంతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం తూర్పు సిటీ అధ్యక్షురాలు కాయల కుమారి, పలువురు ఐద్వా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎఎస్ఐ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న దుర్గారావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. 35 సంవత్సరాలుగా విధి నిర్వహణలో అంకిత భావంతో దుర్గారావు పని చేశారని సిబ్బంది కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా దుర్గారావు సతీమణితో కలిసి విజయవాడలో పోలీసు కమీషనర్ రాజశేఖర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిపి దుర్గారావును పూలమాలతో సత్కరించి అభినందించారు.

ప్రింటర్, స్కానర్ బహూకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సిహెచ్.చాముండేశ్వరి కుమార్తె క్రితిక పుట్టినరోజు సందర్భంగా బుధవారం పాఠశాలకు కలర్ ప్రింటర్, స్కానర్‌ను మండల విద్యాశాఖాధికారి ఎల్.చిట్టిబాబు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విసిహెచ్.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ప్రసాద్‌బాబు, కెవి రత్నం పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్ సందర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండల ప్రత్యేక అధికారి జి.మహేశ్వరరావు బుధవారం మండలంలోని పోచంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అర్థమయ్యే విధంగా వీడియోను ప్రదర్శించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.రమేష్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ ఎన్.నాగరాజు, సిడిపిఒ భార్గవి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం : ఎస్ఐ

ప్రజాశక్తి-నందిగామ: ప్రశాంతమైన మనసుకు యోగా ఎంతో దోహదమని నందిగామ ఎస్ఐ పండు దొర పేర్కొన్నారు. నందిగామ చందర్లపాడు రోడ్డులోని ఫ్లేవర్స్ మల్టీ క్యూసైన్ రెస్టారెంట్ వద్ద యోగ గురువు గాడిపర్తి సీతారామారావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనివర్సల్ యోగా సెంటర్‌ను ఎస్సై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైటెక్ యుగంలో ప్రతిరోజూ ఉదయం ఒక గంట సేపు యోగా చేయడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: బిసి, ఎస్‌సి, ఎస్‌టి, క్రిస్టియన్, ముస్లిం మైనారిటీల ఐక్యవేదిక జెఎసి నూతన కమిటీ బుధవారం ఎన్నికైంది. జవ్వాజీ నరసింహారావు (కన్వీనర్), కె.వి.రత్నం (కో కన్వీనర్), 14మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బహుజన్ నాయకుడు కొదమల ప్రభుదాసు, అంగడాల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. తక్షణమే కుల గణన చేపట్టాలని, జగ్గయ్యపేట ప్రాంతానికి కృష్ణానది జలాలు వెంటనే అందించాలని, జగ్గయ్యపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని, సిమెంటు ఫ్యాక్టరీల్లో జరిగిన ప్రమాదాల్లో చనిపోయిన బాధిత ఒక్కో కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కమిటీ తీర్మానించింది.

డ్రైనేజీల అభివృద్ధికి ప్రతిపాదనలు : మండలి



డ్రైనేజీ మ్యాపును ఎంఎల్ఏకు వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దృష్టిసారించారు. ఈ మేరకు బుధవారం అవనిగడ్డలోని ప్రధాన డ్రైనేజీలను పరిశీలించారు. ముఖ్యంగా ఏడో వార్డులోని సీతాయమ్మ హెూటల్ వద్ద డ్రైనేజీని ఆర్డబ్ల్యూఎస్ డిఈపి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఇందుకు సంబంధించి గ్రామ డ్రైనేజీ స్వరూప మ్యాపును పరిశీలించారు. కరకట్ట నుంచి మండపం మీదుగా మురుగు కాలు వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీని పరిశీలించారు. మురుగు ప్రవాహానికి ఎదురవుతున్న అడ్డంకుల ప్రదేశాలు మ్యాపు ద్వారా సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ అభివద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు బుద్ధ ప్రసాద్ సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు నియోజకవర్గానికి 20 కోట్లు కేటాయించిన నేపథ్యంలో డ్రైనేజీల అభివద్ధికి 20 శాతం నిధులు కేటాయించినట్లు డిఈఈ సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లు భోగాది జగత్ పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

వేకనూరు పీహెచ్ సీని ఆకస్మికంగా తనిఖీ

వేకనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రి అవసరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు పాము కాటు మందుల స్టాక్ రెగ్యులర్ మందుల స్టాక్ గురించి ఆరా తీశారు. చిన్నారులకు రెగ్యులర్ పోలియో చుక్కలు వేశారు. అలాగే ఇటీవల గన్నవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన పార్టీ నాయకులు మాదివాడ ఏడుకొండలు(చింతాలు కొండలు) కుటుంబాన్ని బుద్ధ ప్రసాద్ పరామర్శించారు.

బుద్ధ ప్రసాద్ ను కలసిన బాపూ శిష్యుడు సురేష్

ప్రఖ్యాత చిత్రకారుడు, కీర్తిశేషులు బాపూ శిష్యుడు నరసాపురం పట్టణానికి చెందిన చిత్రకారుడు కడలి సురేష్, విజయవాడ మన గ్రామం అధినేత మొవ్వ రామకష్ణ బుధవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 4వ తేదీన మాజీ మంత్రి కీర్తిశేషులు మండలి వెంకటకష్ణారావు జయంతిని పురస్కరించుకొని కడలి సురేష్ చిత్రించిన వెంకట కష్ణారావు ప్రభావతి దంపతుల చిత్రాన్ని ఎమ్మెల్యే దంపతులకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని వివిధ శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సమీక్షిం చారు. బుధవారం ఆయన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక, మైన్స్, ఎక్సైజ్, పర్యాటక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆయా శాఖలు అమలు పరుస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలపై విభాగాల వారీగా సమీక్షించి వివరాలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో సాగు చేస్తున్న చేపలు, రొయ్యలు, పీతల పెంపకంపై అవలంబించే పద్ధతులు, మత్స్యకారులకు అమలు చేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కౌలు రైతులకు సిసిఆర్సి కార్డుల జారీ, బ్యాంకు రుణాలు, అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, ప్రస్తుతం సాగైన విస్తీర్ణ వివరాలు, పొలంబడి కార్యక్రమం అమలు, ఈ పంట నమోదు, ఇన్పుట్ సబ్సిడీ తదితర వివరాలపై ఆరా తీశారు. డీ ఆర్ డీ ఏ ఇన్చార్జి పీడీ ఎస్ వి. నాగేశ్వరనాయక్, మెప్మా పీడీ నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, ఉద్యాన శాఖ అధికారిణి జే జ్యోతి, మత్స్య శాఖ అధికారి ఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిఐడికి కేసు అప్పగించడంపట్ల హర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో నాలుగేళ్ల క్రితం హత్యకు గురైన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య కేసు సిబిసిఐడికి విచారణ కోసం అప్పగిం చడం ద్వారా ఇప్పటికైనా దోషులకు శిక్ష పడుతుందని విశ్వాసం కలిగిందని ఆయన తనయుడు డాక్టర్ కోట ప్రవీణ్ తెలిపారు. బుధవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను డాక్టర్ ప్రవీణ్ ఆయన సోదరుడు కోట శ్రీధర్‌రావు, బావమరిది బచ్చు వెంకట్నాథ్‌తో పాటు కోడూరు ఆవనిగడ్డ, నాగాయలంక మండలాలకు చెందిన పెద్దలు శ్రీహరి అభిమానులు బుద్ధ ప్రసాద్ ను కలసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ విచారణ వేగవంతం చేసి దోషులకు సరైన శిక్ష పడేలా కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోట రాంబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు చిన్నగిరి సత్యనారాయణ, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మర్రి గంగయ్య, పూత బోయిన సీతారత్నం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

సూపర్ సిక్స్ హామీలు అమలు జరుగుతాయి : కొనకళ్ల

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, సూ పర్ సిక్స్ పథకాలు అమలు జరుగుతాయని టిడిపి జిల్లా అధ్యక్షులు ,మాజీ పార్లమెంట్ సభ్యు లు కొనకళ్ళ నారాయ ణరావు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమా వేశంలో నారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు ప్రజా ప్రయో జనానికి అవసరమైన మరిన్ని పథకాలను ప్రవేశ పెట్టడానికి సిద్ధంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ ఏ కాకుండా ప్రజలకు అవసరమైన అనేక పథకాలను అమలు చేయటానికి ఎన్‌డిఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన నిరు పేదలందరికీ 2029 నాటికల్లా శాశ్వత గహ వసతి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నూతన లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు కేటాయింపు చేయాలని నిర్ణయిం చామన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జి బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తినదాస్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల టెండర్లలో నిబంధనలు పాటించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వివిధ శాఖల్లో అభివద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఆ మేరకు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఉపాధి హామీ గహ నిర్మాణం, టిడ్కో, విద్యుత్, పి ఆర్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.గహ నిర్మాణం సంబంధించి లే అవుట్ లలో, టిడ్కో సముదాయాలలో మౌలిక సదుపాయాల కల్పన సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. లేఔట్లలో మెరక, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు పనులు, రిజిస్ట్రేషన్ అయిన గహాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 2.11 లక్షల జాబ్ కార్డులు జారీ చేశామని, 59.11 లక్షల పని దినాలు కల్పించి, రు.154.13 కోట్లు కూలీల వేతనం చెల్లించినట్లు, కూలీల సరాసరి వేతనం రు. 260.78 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కింద సీజన్లో, ఆఫ్ సీజన్లో చేపట్టే పనులపై ఆరా తీశారు. చేపట్టిన పనులు పరిశీలిస్తామన్నారు. ఉపాధి హామీ కింద రైతుల పొలాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసినప్పుడు వాటి గట్లపై కూరగాయల పెంపకం సాగు ప్రోత్సహించి రైతుల ఆదాయం పెంచాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ ల అభివద్ధి చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో డ్వామా పిడి, హౌసింగ్ పిడి ఇంచార్జ్ జీవి సూర్యనారాయణ, టిడ్కో పీడీ బి. చిన్నోడు, ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఇ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు .

రక్తదానంపై అవగాహన

ప్రజాశక్తి-చల్లపల్లి : రక్తదానంపై అవగాహన సదస్సు స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకత, సంవత్స రంలో ఎన్ని సార్లు రక్తదానం చేయవచ్చు, ఏ వయసు వారు చేయవచ్చు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి రమేష్‌బాబు, లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి విఆర్‌కె నగర్ అధ్యక్షులు రాయపాటి రాధాకష్ణ, లయన్ తగిరిశ సాంబ శివరావు ఇంగ్లీష్ లెక్చరర్ కె.. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

5 కల్లా అన్న క్యాంటీన్ల పనులు పూర్తి చేయాలి

- విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజాశక్తి - విజయవాడ : ప్రజలు వ్యాధుల బారిన పడకుండా సురక్షితమైన తాగునీటినే సరఫరా చేసేలా అధికారులు పర్యవేక్షించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని డాక్టర్ కె ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్సును పరిశీలించారు. అనంతరం విద్యాధరపురంలోని ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, హెచ్‌బి కాలనీ, గాంధీజీ మహిళా కళాశాల వద్ద జరుగుతున్న అన్న క్యాంటీన్ల పున:నిర్మాణ పనులను పరిశీలించి ఆగస్టు 5వ తేదీకల్లా వాటిని పూర్తిచేయాలని ఆదేశించారు. హనుమాన్ పెట్టలో గల వెహికల్ డిపోను సందర్శించారు. ఈపర్యటనలో విఎంసి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, యస్ఈ రామ్మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రసాద్, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని మండల ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు బుధవారం పరిశీలించారు. ప్రధానంగా వసతి గృహం వెనుక వైపున మురుగు కాలువ ఉండటం వల్ల విపరీతమైన దోమలకు నిలయంగా మారి పోయిం దని, దీనితో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి కనపడుతుందన్నారు. వసతి గృహం వెనుక వైపున మెరక పోలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు. అదే విధంగా పంచాయతీ వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బ్లీచింగ్ చెల్లించడంతోపాటు దోమల నిర్మూలనకు దోమల మందు పిచికారి చేయాలని సూచించారు. వసతిగృహం చుట్టూ నివాస గృహాలు ఉన్నందున ప్రహరీ గోడ కూడా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. వసతి గృహానికి కావలసిన అవసరాలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గంలోని అన్ని వసతి గహాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని వేణు గోపాల్ తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మెనూ పరిశీలించి వారితో పాటు కలసి భోజనం చేశారు.



పాడైన మరుగుదొడ్లు చూపిస్తున్న దృశ్యం

విద్యా సంస్థల యాజమాన్యాలతో డిసిపి సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ : విద్యా సంస్థల యాజమానులు, బస్సు ఆపరేటర్లతో బుధవారం ట్రాఫిక్ డిసిపి కె. చక్రవర్తి సమావేశమయ్యారు. నగరంలో పెరుగుతన్న ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఈ సమావేశంలో డిసిపి మాట్లాడుతూ నగరంలోని కళాశాలలు, పాఠశాలల వద్ద ట్రాఫిక్ రద్దీ, విద్యార్థుల భద్రతకు పలు సూచనలు చేశారు. ఈసమావేశంలో ట్రాఫిక్ ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డెమొక్రటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డెమొక్రటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గజం విజయ్, మరీదు ప్రసాద్ బాబు, గౌరవాధ్యక్షునిగా జి.వి.రంగారెడ్డి నియమితులయ్యారు. విజయవాడలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు కన్వీనర్ బళ్ళా రాధాకష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 33 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 33 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. బుధవారం 5వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 33 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను బుధవారం సంబంధిత ఆరవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరి చారు. న్యాయమూర్తి జి.లెనిన్ బాబు నిందితుల్లో 10 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 23 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం మొగులూరు



గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఆరిఫ్ మున్నిసా బేగం కుమార్తె ఫౌజియా లివర్ వ్యాధితో బాధ పడుతుంది. చిన్నారికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కును నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అద్యక్షుడు కోగంటి బాబు, మాజీ వైస్ ఎంపీపీ వెలగా నరసింహారావు, నాయకులు వెలగా తిరుపతిరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-నందిగామ: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఎస్ఐ పండు దొర పేర్కొన్నారు. బుధవారం నందిగామ కె.వి.ఆర్ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. అవగాహన సదస్సు కులో నందిగామ ఎస్ ఐ పండు దొర ముఖ్య అతిథిగా సైబర్ నారాలు ఏ విధంగా జరుగుతున్నాయి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం విజయవాడలో జరిగే శిక్షణా తరగతులకు కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి పోలీసువారి యాప్ లింకు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ పి రాయప్ప అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మున్సిపల్ 2వ వార్డు వైసిపి కౌన్సిలర్ తానూరి రాము బుధవారం నందిగామ ఎంఎల్ఎ



తంగిరాల సౌమ్య సమక్షంలో టిడిపిలో చేరారు. రాముకు ఎమ్మెల్యే టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అద్యక్షుడు ఏచూరి రాము, కార్యదర్శి కాసర్ల లక్ష్మీ నారాయణ, కౌన్సిలర్లు కామసాని సత్యవతి, మారం అమరయ్య, శాకమూరు స్వర్ణ లత, మండవ కష్ణ కుమారి, సాంబయ్య పాల్గొన్నారు.

సోచ్ మూడో షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎత్నిక్ వేర్ బ్రాండ్ సోచ్ విజయవాడ నగరంలో మూడవ స్టోర్‌ను గాయత్రినగర్‌లోని విఎస్ఎన్ మాల్‌నందు ప్రారంభించినట్లు షోరూమ్ ఇన్‌ఛార్జి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో తమ సంస్థలకు మూడవ షోరూమ్ అని, ఈస్టోర్ ప్రారంభోత్సవంతో ఎత్నిక్ ఫ్యాషన్ కోసం పెరుగతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తమ స్టోర్లను విస్తరిస్తున్నామని తెలిపారు. ఫ్యాషన్ ప్రియుల కోసం సల్వార్ సూట్లు, డ్రెస్‌లు, గౌన్‌లు, కుర్తీ సూట్లు, చీరలు, కాఫ్తాన్‌లు, విస్తృత స్థాయిలో అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు గాయత్రినగర్‌లోని స్టోర్ నందు సంప్రదించవచ్చని తెలిపారు.

మణికుమారికి సన్మానం

ప్రజాశక్తి-మైలవరం: ఎంపియుపిఎస్ వెదురుబీడం పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ బుధవారం



ఉద్యోగ విరమణ చేసిన వేములపల్లి మణికుమారిని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలుగా మణికుమారి ఎంతోమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుప్రియకుమారి, ఎన్.శేషగిరి, ఉషారాణి పాల్గొన్నారు.

1,760 ఎకరాల్లో పండ్లు, పూల తోటల పెంపకం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-మైలవరం: ఎన్‌టిఆర్ జిల్లాలో 1,760 ఎకరాలలో పండ్లు, పూల తోటల సాగును చేపట్టేలా రైతులను ప్రోత్సహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కొత్త మంగాపురంలో చేపట్టిన మల్లె తోటలను బుధవారం సందర్శించి రైతులతో ముఖాముఖి చర్చించారు. రైతు కుప్పాల ముత్తయ్యను మల్లెతోటకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు వారికి అవసరమైన నాణ్యత గల పూలు, పండ్ల మొక్కలు, ఎరువులను నేరుగా కొనుగోలు చేసుకునేందుకు ఉపాధి హామీ నిధులు ద్వారా చెల్లించటం జరుగుతుందన్నారు. చిన్నా సన్న కారు రైతులకు పండ్లు, పూల తోటల పెంపకం ఆర్థికంగా ఎదగటానికి ఎంతో ఉపయోగపడుతుందని, పండ్లు పూల సాగును చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ఉపాధి హామీ ద్వారా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ జె సునీత, డిపిఓ ఎన్వి శివప్రసాద్ యాదవ్, ప్లాంటేషన్ మేనేజర్ కే ఉషారాణి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎస్ వంశీకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.





పంటలను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ సృజన

పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

ఎన్‌టిఆర్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. మైలవరం మండలంలోని చిలుకూరివారిగూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో బోధన ప్రణాళిక నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు భోజనాన్ని స్వయంగా వడ్డించారు.

విద్యార్థులకు టీచింగ్ ప్లాన్ ప్రకారం తరగతులు నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన సహపాఠ్య కార్యక్రమాలపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు హాజరయ్యేలా చూసి.. నిర్దేశ బోధన ప్రణాళికకు అనుగుణంగా విద్యా నైపుణ్యాలు అందించేందుకు కషిచేయాలన్నారు. భవిష్యత్తు కెరీర్ పరంగా ఉన్న అవకాశాలు, వాటిని అందుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలపైనా వివరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల్లో ఇంకా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి

స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ

ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆసుపత్రులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఇప్పటికే పెద్ద సంఖ్యలో బకాయిలు ఉన్నాయని వాటిని విడుదల చేసి, ఆసుపత్రులపై భారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్ అసోసియేషన్ (ఆషా) అధ్యక్షులు డాక్టర్ కె.విజయకుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దాదాపుగా 8 నెలలుగా బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించామని, తాజా పరిణామాల్లో నెలకొన్ని ఆర్థిక ఇబ్బందుల వలన ఆసుపత్రులను నిర్వహించలేని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్న ఆసుపత్రులకు గత ప్రభుత్వం రు. 1750 కోట్లు బకాయి పడినపుడు ఆసుపత్రుల నిర్వహణా భారంగా ఉందన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు నోటీలు ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన అప్పటి ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు తక్షణం 500 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని కాని విడుదల చేయలేదన్నారు. దీనితో ప్రస్తుతం ఆసుపత్రులకు రావాల్సిన బకాయిలు 2 వేల కోట్లకు పెరిగిపోయాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే రు. 150 కోట్లు విడుదల చేసిందన్నారు. అయినప్పటికీ బకాయిలు బాగా పేరుకుపోవడం వలన ఆసపత్రుల నిర్వహణ చాలా కష్టంగా ఉందన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఎలక్ట్రానిక్స్‌లో అగ్రగామి శాంసంగ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను అందించడంలో శాంసంగ్ అగ్రస్థానంలో ఉందని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ సీఈవో డీజోన్ హాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంసంగ్ ఉత్పత్తులు, వాటి వినియోగం, వినియోగారుల అభిరుచులను తెలుసుకునేందుకు శాంసంగ్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. శాంసంగ్ ఉత్పత్తులను నోయిడాలోని ఫ్యాక్టరీ నుండి ఉత్పత్తి చేస్తుందని ప్రదానంగా స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు, రిఫ్రిజిరేటర్‌లు వంటివి తయారుచేసి అందిండంలో తమ సంస్థ ముందు ఉంటుందన్నారు. తమ ఉత్పత్తులను పరిశీలించేందుకు ఇటీవలే కంపెనీని సందర్శించినప్పుడు పలువురు వినియోగదారులు తమ ఉత్పత్తుల పట్ల మంచి ఆదరణ కనపరుస్తున్నారని తెలిపారు.

రోడ్లు బాగు చేయకపోతే ఉద్యమం

కృష్ణలంక 21వ డివిజన్ పర్యటనలో కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: తవ్వి వదిలేసిన రోడ్లన్నీ అధ్వానంగా తయారై ప్రమాదాలకు కారణమవుతున్నాయని,వెంటనే మరమ్మతు చేయకుంటే ఉద్యమించాల్సి వస్తుందని సిపిఎం నేతలు హెచ్చరించారు. బుధవారం కృష్ణలంక 21వ డివిజన్‌లోని అంతర్గత రోడ్లను సిపిఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ డివిజన్‌లోని రోడ్లన్నీ తవ్వి వదిలేశారని, దీని వల్ల ప్రజలు నడవడానికే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం, విఎంసి నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. డివిజన్‌లో ప్రధానంగా రెండు పెద్ద స్కూల్స్ ఉన్నాయని, సుమారు రెండు వేల మంది పిల్లలు చదువుతున్నారని, వారిని స్కూళ్లల్లో వదిలిపెట్టడానికి వచ్చే తల్లితండ్రులతో రోడ్లు రద్దీగా ఉంటున్నాయని, ఈ క్రమంలో గోతులమయంగా ఉన్న రోడ్లపై ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటికే కల్పన ప్రింట్స్ రోడ్డులో కుటుంబ సమేతంగా వెళ్తున్న ౦ండు కుటుంబాలకు ప్రమాదం జరిగి ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. కల్పన ప్రింట్స్ రోడ్డులో ప్రతి ఇంటికో మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారని, దీంతో రోడ్లు డౌన్ అయి మ్యాన్‌హోల్స్ ఎత్తు పెరిగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయన్నారు. కొత్త డ్రైనేజీకనెక్షన్‌ల పేరుతో ఇంటికో మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసి ఒక్కో డ్రైనేజికి రూ.4 వేలు వసూళ్లకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే పగలకొట్టిన వాటి స్థానంలో కొత్త రోడ్లు వేయాలని, అవసరమైన చోట మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. విఎంసి అధికారులు తక్షణమే స్పందించకపోతే ప్రజలతో పోరాడేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కష్ణ, నగర కమిటీ సభ్యులు కోరాడ రమణ, స్థానిక నాయకులు తాడి రమణ, కె.శివాజీ, రాజా, కుమ్మరి రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న సిపిఎంనాయకులు కాశీనాథ్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్